# దోపిడీ

"ఓహో! పెళ్ళికూతురుగారా, ఏమిటి ఇటొచ్చారు?" సీత రాగానే పలకరింపుగా అంది రాధ.

"నీకూ్కడా వెక్కిరింతగా ఉందే!"

"అఁహఁ! అది కాదే—"

"నా పెళ్ళి కోసం కావలసిన డబ్బుకు నాన్న నానా తంటాలూ పడుతుంటే నేను సంతోషంగా ఎట్లాఉండగలను?" నిట్టూరుస్తూ సీత అంది.

"ఇది నీ ఒక్కదాని సమస్యే అయినట్లు బాధపడతావేం? ఎక్కడ ఆడపిల్ల ఉండునో—అక్కడ ఈ బాధలన్నీ ఉండును" అంది నవ్వుతూ వాతావరణం తేలిక చేసే ప్రయత్నంలో రాధ.

"అయినా ఎవరిదాకా వచ్చినప్పుడు వాళ్ళకిబాధ తప్పదుకదే! అసలు నీ దగ్గరకు వచ్చిన పని విషయమే మరిచిపోయాను. చూడు మా నాన్న నా పెళ్ళి ఖర్చుల కోసమని మ్యారేజీ లోన్, జి.పి.ఎఫ్. లోన్ల కోసం అప్లై చేశారు. ఆ లోన్ శాంక్షన్ చేయాలంటే ఆఫీసు ఉద్యోగస్తులే ఆఫీసరుగారికి 500 రూపాయలు లంచంగా ఇవ్వాలట...." అంది వివరంగా చెపుతూ సీత.

"ఎంత అన్యాయం!...."

"న్యాయమో, అన్యాయమో పరిస్థితి ఇది! మీ బాబాయిగారు హెడ్ ఆఫీసులో ఉన్నారు కదా! ఆయనేమన్నా సాయం చేయగలరేమో అని వచ్చానే నీ దగ్గరకు."

"తప్పకుండా అడుగుదాం" అంటూ, రాధ సీతను తీసుకొని ఆఫీసుకి వెళ్ళింది. పరిచయాలయ్యాక విషయం వివరించింది రాధ.

"చూడమ్మా రాధా! సీత తండ్రి మా బ్రాంచి ఆఫీసులోనే పని చేస్తున్నారు." నిజమే- కానీ పనికావడానికి "కొంత చెల్లింపు తప్పదు...." అన్నాడు.

"అదేమిటీ? అప్పు పద్ధతి ప్రకారం రావడానికి నువ్వు సాయం చేస్తావనుకుంటే నువ్విట్లా అనడం ఏం న్యాయం బాబాయ్?" రాధ చనువుగా, నిర్మొహమాటంగా అడిగింది.

"నేనేం చేయనమ్మా? లంచం తీసుకోవడమనే ఈ జాడ్యం చీడ పురుగులా దాపురించి, సర్వసామాన్యమైపోయింది. అయినా తప్పదు. అది లేకపోతే పని జరగదు మరి! నా వరకు నేను ఇంటికోసం లోన్ తీసుకున్నప్పుడు మా పై ఆఫీసరుకు ముడుపు చెల్లిస్తే గానీ ఫైలు మాట్లాడలేదు. ఈ కేసులో నేనూరికే సాయం చేశానన్నా ఎవరూ నమ్మరు. "ఓ వంద రూపాయలు ఇవ్వవలసిందేనమ్మా."

"ఈ అన్యాయాన్ని ప్రతిఘటించే వీల్లేదా బాబాయ్?" అంది రాధ బాధగా.

"లేదమ్మా! ఆ ప్రయత్నంలో నేను చాలాసార్లు దెబ్బతిన్నాను. సీత పెళ్ళికి అడ్వాన్స్ పెళ్ళి ప్రెజెంటేషన్ ఇచ్చేస్తున్నా ననుకొని— ఆ డబ్బు నేనే సమర్పించుకొని లోన్ శాంక్షన్ చేయిస్తాను..." బాబాయి మాటలకు చెప్పవలసిన సమాధానమేమిటో అర్థం కాక సీత, రాధ— ఇద్దరూ మెల్లగా ఆఫీసు నుంచి బయటికి నడిచారు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 24-12-86)